

కథ

పి.లక్ష్మీశారద

# వెయిట్..వెయిట్!

ఉదయం ఐదింటికే వాకింగంటూ పరుగులు తీస్తున్న మాధురిని చూసి జాలేసింది నాకు. ఈ వయసులో ఈ పిల్లకు అంత అవసరమేమొచ్చింది? మొగుడు-ఇద్దరు పిల్లలు-అత్తమామలు-వీళ్లందరికీ వండిపెట్టి సేవలు చేసి, అర్థ రాత్రి దాటితే కానీ నిద్రకుపక్రమించని థర్టీప్లస్ అమ్మాయి వేకువనే లేచి అలా పరుగులు తీయకపోతేనేం?

ఇది చాలదన్నట్లు.. పదకొండు గంటలకు దగ్గర్లో ఉన్న స్ట్రెస్‌రిలీఫ్ సెంటర్‌కు వెళ్లి సైక్లింగ్-స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయటం.

"నీకేమైనా పిచ్చా.. ఇంటి చాకిరీ సరిపోవటంలేదా నువ్వు తిన్న తిండి అరిగించుకోటానికి - కేలరీలు కరిగించుకోటానికి.. ఇంకా ఏవిటి ఈ పరుగెత్తటాలు..సైకిలు తొక్కటాలు.. ఇలాగైతే నీరసించి మంచానపడతావు..." అని హెచ్చరించి చూశాను.

అబ్బే వింటేనా...?

"అసలు ఎందుకీ విచిత్ర విన్యాసాలు" అని అడిగాను.

"అదో దేవ రహస్యం" అంది మాధురి.

"ఏ దేవుడు... పతి దేవుడా?" అన్నాను.

"అబ్బ కరెక్టుగా కనిపెట్టేశారాంటీ" అంది.

నాకు అర్థమై చావలా.

"ఆ పతిదేవ రహస్యమేంటో చెప్పిచావొచ్చుగా" అన్నాను.

"ఏముంది.. మొగుడు కంటే పెళ్లాం తక్కువ కదా ఆంటీ" అంది.

"నాన్సెన్స్... మొగుడు పెళ్లాల మధ్య ఎక్కువ తక్కువలేంటి? ఇద్దరూ చెరి సగం - సరిసమానం .. నీ 'ఎమ్మే' చదువు నీకిదేనా నేర్పింది?" అన్నాను.

"అబ్బ అది కాదాంటీ... ఎంతైనా మనం ఆడవాళ్లం కదా.. మగాళ్లంత మోటుగా - వెయిటుగా ఎలా ఉంటాం చెప్పండి... అలా ఉంటే ఏం బాగుంటుంది? మనం సాఫ్ట్‌వేర్లం.. మగాళ్లు హార్డువేర్లు కదా" అంది.

"నోరు మూస్తావా? వేర్లు-కాండాలు అంటూ ఏవిటీ అర్థం పర్థం లేని మాటలు? ఇంకా నయం మనం 'అండర్‌వేర్లం' అనలేదు" అన్నాను.

"ఛీ.. పోండాంటీ" అంటూ కిలకిలా నవ్వింది.

"సరేగాని.. ఆ దేవరహస్యం ఏవిటో కాస్త చెప్పు తల్లో" అన్నాను.

"మరేం లేదు ఆంటీ.. నేను ఓ రెండు కిలోలు 'వెయిట్ లాస్' కావాలనుకుంటున్నాను. అందుకని ఈ ప్రయాస" అంది.

"ఏం పాపం మీ పతిదేవర.. ఆ రెండు కిలోల బరువు మోయలేనంటున్నాడా... అసలింతకీ నీ వెయిటెంతో చెప్పు" అన్నాను.

"అరవై కిలోలు"

"స్వీట్ సిక్స్టీ అన్నమాట... నీ హైటుకు తగ్గ వెయిటే" అన్నాను.

"నా వెయిట్ ఓ.కె. అయితే సరిపోతుందేవిటి? ఆయన నా కంటే రెండు కిలోలు తక్కువున్నారు తెలుసా ఆంటీ" అంది.

"ఉండనీ మంచిదేగా.. నువ్వు ఆయన్ని ఎంచక్కా ఎత్తుకోవచ్చు. కోపం వచ్చినప్పుడు ఎత్తిపడేయచ్చు... ఇంతకంటే మనకు అవకాశం ఎప్పుడొస్తుంది చెప్పు?" అన్నాను.

"మీరు అన్నీ 'లైట్'గా తీసుకుంటారాంటీ... కానీ నేనలా కాదే" అంది.

"పోమ్మా.. ఇదేదో పెద్ద అంతర్జాతీయ సమస్యలా ఫీలయిపోతున్నావ్. నన్నడిగితే నువ్వు మరో నాలుగు కిలోల బరువు పెరిగి మీ ఆయన ఎప్పటికీ నిన్ను 'బీటౌట్' చెయ్యకుండా చూసుకో" అన్నాను.

"నా సమస్య మీకు అర్థం కాదాంటీ. వాకింగ్ - సైక్లింగ్‌తో పాటు డైటింగ్ చేస్తున్నా నేను బరువు తగ్గటం లేదు. ఏదైనా సలహా చెప్పి పుణ్యం కట్టుకోండాంటీ" అంది.

"పిచ్చి తల్లీ.. ఆడపిల్లలు బొద్దుగా వొళ్లుగా ఉంటేనే చూడముచ్చటగా ఉంటారు. స్లిమ్‌గా ఉండాలని జిమ్‌ల కెళ్లి.. 'జీరో' సైజు బాడీ కోసం ట్రై చేస్తే షోకేసులో బొమ్మలకు తప్ప కాపురానికి పనికిరారు. కర్రముక్కల్లా ఉంటే కంటికింపుగా ఉంటారా చెప్పు. అందుకని 'వెయిట్' గురించి ఆలోచించటం మాని శుభ్రంగా తిని.. మరో నాలుగు కిలోలు బరువు పెరిగి.. నీరసపడకుండా ఇంటి పని చేసుకో. ఇప్పుడే మార్నింగ్ వాక్‌లు.. సైక్లింగ్‌లు అవసరం లేదు నీకు" అన్నాను.

నా సలహా నచ్చినట్లు లేదు మాధురికి.

"కొంచెం పనుంది మళ్లీ వస్తానాంటీ" అంటూ చల్లగా జారుకుంది.

* * *

రోజులు గడుస్తున్నాయి.

మాధురి మార్నింగ్‌వాక్ - డైటింగ్‌లు చేస్తూనే ఉంది. ఆ రెండు కిలోల బరువు మాత్రం తగ్గలేదు. జీవితంలో ఏదో విలువైనది పోగొట్టుకున్నట్లు పిచ్చిదానిలా తయారైంది.

ఒలింపిక్స్‌లో ఫైనల్స్ దాకా వెళ్లి 'గోల్డ్‌మెడల్' మిస్సైనంతగా ఫీలయిపోతూ డిప్రెషన్‌లోకి జారుకుంటోంది.

పిలిచి కౌన్సిలింగ్ చేద్దామంటే నాకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతోంది. దొరికితే... తిక్కతిక్కగా మాట్లాడతానని భయం.

నేను చెప్పిందాంట్లో తప్పేముంది చెప్పండి.

మగాళ్లు.. ఆఫీసులో పొద్దున్న నుంచి.. సాయంత్రం దాకా కూర్చుని కంప్యూటర్ 'కీబోర్డు' మీద వేళ్లు ఆడించటమో.. ఫైల్సు తిరగేయటమో.. ఫోన్లో నైసుగా మాట్లాడటమో చేస్తుంటారు. ఇందులో శారీరక శ్రమేం ఉంది? ఇక ఇంటి నుంచి ఆఫీసుకి.. ఆఫీసు నుంచి ఇంటికి ఏదో ఒక వాహనం మీద కూర్చుని ప్రయాణం తప్ప నడకేది? ఈ మాత్రందానికి ఆఫీసు నుంచి ఇంటికి రాగానే అప్పుడే డెలివరీ అయినంత నీరసం ప్రదర్శిస్తూ కాఫీ, టీ - స్నాక్స్ చేతికందించేంత వరకు సోఫాలో ఆపసోపాలు పడి పోతుంటారు. మరి ఉద

యాన్నే లేచింది మొదలు రాత్రి పడుకోబోయేంత వరకు ఇంటెడు చాకిరీ... మొగుడు పిల్లల.. ఉమ్మడికుటుంబమైతే అత్తమామల ఆలనా పాలనా చూసుకునే ఇల్లాలు ఎంత శారీరక శ్రమ - మానసిక వత్తిడికి గురవుతుందంటారు? ఎంత పనిమనుషులుంటే మాత్రం.. వాళ్లు చేసే అరగంటో గంటో పని ఇల్లాలు చేసే పనిలో ఎన్నో వంతు? ఈ రోజుల్లో వాన రాకడ ప్రాణం పోకడ కూడా చెప్పగలమేమో కానీ, పనిమనుషుల రాకడ పోకడ మాత్రం చెప్పటం ఎవ్వరి తరం కాదు.

వాషింగ్ మెషిన్, గ్రైండర్, వాక్యుమ్‌క్లీనర్ ఉండగానే సరా?

బట్టలు వాటంతట అవే మెషిన్‌లోకెళ్లి ఉతికించుకుని - బైటకొచ్చి దండెం మీద ఆరవేసుకుని ఆరాక వాటంతటవే వచ్చేసి మడతపెట్టేసుకుని కప్‌బోర్డులోకి వెళ్లి కూర్చుని తలుపేసుకోవుగా? అలాగే 'హాంఫట్' అంటే, మినప్పప్పు - పెసరపప్పు గ్రైండర్‌లో పడిపోయి, రుబ్బించేసుకుని - బైటకొచ్చి గిన్నెల్లోకొచ్చి కూర్చోవుగా - ఆ తర్వాత గ్రైండర్ జార్ తనంతట తనే కుళాయి కింద కూర్చుని క్లీన్ చేసుకుని వచ్చి తన యధాస్థానంలో కూర్చుండిపోదుగా? అలాగే వాక్యూమ్ క్లీనర్.. దానంతటదే తైతక్కలాడి బూజు-గీజు తీసేయదుగా? మెషిన్లు ఎన్ని ఉన్నా ..మనుషుల సహకారం లేందే ఫలితం సున్నా.

ఆఫీసులో మగాళ్లు లేదా ఆడవాళ్లైనా కావొచ్చు.. కంప్యూటర్ల ముందు కూర్చుని కళ్లప్పగించి చూస్తేనే.. పనులు అయిపోవుగా. ఇన్‌పుట్ లేందే అవుట్‌పుట్ ఎలా వస్తుంది? మొగుడు పెళ్లాలు ఒకర్నొకరు చూసుకుంటూ కూర్చుంటే పిల్లలు పుట్టేస్తారా?

అందుకే చెప్పొచ్చేది.. ఆడ-మగా అందరూ శ్రామికులే. సంపాదించే మగాడు ఎంత కష్టపడుతున్నాడో కుటుంబం మొత్తానికి సేవలు చేసే స్త్రీ అంత కంటే ఎక్కువ శారీరక శ్రమ చేస్తోంది. స్త్రీ శ్రమకు విలువ కడితే మగాడి సంపాదన కంటే ఎక్కువ జీతమే ఇవ్వాలి. ఇలా డబ్బుల్తో కొలిచేది కాదు భార్యాభర్తల బంధం. ఈ విషయం అర్థం చేసుకోక స్త్రీని బాండెడ్ లేబర్‌లా చూడటం పురుషుడి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. భార్యాభర్తల్ని కట్టిపడేసేవి ప్రేమ.. అనురాగం - ఆప్యాయత - ఇవి డబ్బు పెట్టి కొనటానికి బజార్లో దొరికే వస్తువులు కాదు. హృదయ స్పందనల్లో నుంచి పుట్టుకొచ్చే అనిర్వచనీయమైన మధురానుభూతులు.

★ ★ ★

ఎందుకో తెలీదు కానీ సడన్‌గా.. రన్నింగ్, డైటింగులు మానేసింది మాధురి. కారణం తెలుసుకుందామంటే నాకు దొరకటం లేదు తను. అలాగని నేను అంత ఈజీగా వదిలేస్తానా? దొరక పుచ్చుకుని విషయం రాబట్టాను.

"భలే దానివే.. ఇప్పుడు నిజమైన 'ఎమ్మే'వి అనిపించావు" అని.

అసలు విషయం చెప్పకుండా ఏవిటీ కథ ముగింపు అనుకుంటున్నారా? కథ టైటిల్‌లోనే చెప్పాగా ఇంకా వివరంగా చెప్పమంటారా? పాఠకులు ఆర్డరేస్తే రచయితకు తప్పుతుందా... వినండి.

తనెలాగూ రెండు కిలోల 'వెయిట్‌లాస్' కావటం లేదని వాళ్లాయన్ని రెండు కిలోల బరువు పెంచేసిందట.. గడుసు పిల్లే.

సో - ప్లస్ ఆర్ మైనస్ - టు - సాల్వ్‌డ్ ది ప్రాబ్లమ్.

○



